dctelugu.com

డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 04 08 శనివారం, ఆగస్టు 2026

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం..

రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి..

విస్తృతంగా ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలి..

ప్రతి నీటి బొట్టును ఒడిసిపెట్టాలి..

జలసిరి ని రైతులు వినియోగించుకోవాలి..

పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి..

రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్ చిగురుమామిడి మండలాల్లో రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం..

కరీంనగర్, ఆగస్టు 7 డీసీ :

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతులు, మహిళా సాధికారత, పశుసంవర్ధక రంగాల్లో రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో శుక్రవారం రూ.2 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో పాటు ప్రజాప్రతినిధులు జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వరపల్లిలో రూ.1.56 కోట్లతో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనం, ఓపెన్ కవర్ షెడ్, ఆర్చి, బోర్‌వెల్, లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం వెంకపల్లి, సైదాపూర్ మార్కెట్ యార్డులో రూ.30 లక్షలతో 100 మెట్రిక్ టన్నుల గోదాం, నూతన మార్కెట్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా మంత్రి మొక్కలు నాటారు. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లిలో రూ.30 లక్షలతో వెటర్నరీ సబ్ సెంటర్, రూ.16 లక్షలతో వివో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే చిగురుమామిడి మండల కేంద్రంలో రూ.20 లక్షలతో ప్రాథమిక పశువైద్య కేంద్రానికి అదనపు గదులు, మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఆయచోట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సైదాపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ఆధునికీకరణ చేపడుతున్నామని చెప్పారు. ఐదు ఎకరాల స్థలం అందుబాటులో ఉంటే ఏ గ్రామంలోనైనా సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. రైతులు అధిక ఆదాయం ఇచ్చే పంటల వైపు మళ్లాలని సూచించిన మంత్రి, సమీపంలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉన్నందున ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున చేపట్టాలని పిలుపునిచ్చారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ఆయిల్ పామ్ విస్తరణకు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఆరుతడి పంటలను కూడా విస్తృతంగా సాగు చేయాలని సూచించారు.

వర్షపు నీటి సంరక్షణ కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, వ్యవసాయ భూముల్లో ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేసుకోవాలని, జలసిరి కార్యక్రమాన్ని రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని మంత్రి కోరారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, బస్సులు, పెట్రోల్ బంకులు వంటి అనేక ఉపాధి అవకాశాలను మహిళా సంఘాలకు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గ్రామాల మధ్య రహదారి అనుసంధానం, 29 వంతెనల నిర్మాణానికి రూ.33 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందుర్తి--ములకనూరు వంతెనలు త్వరలో పూర్తవుతాయని, కరీంనగర్ ఫోర్‌లైన్ రోడ్డు పనులు వేగవంతమవుతున్నాయని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ వేగంగా కొనసాగుతోందని, త్వరలో సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తూ హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి ఆర్డీవోలు షర్మిల, జల కుమారి జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా..

- **రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలివ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,**
- **ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులి**
- **వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును మరింత విస్తరించవద్దులి**
- **ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**
- **గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు... ప్రస్తుతం 16 లక్షలకు పైగా కొత్త కార్డుల మంజూరు**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలి**

కరీంనగర్ డీసీ

రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే శ్రీనివాస్ రెడ్డి డిఆర్ఓ స్వామి ఆర్డీవో షర్మిల ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

నేతన్నలకు చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

నేతన్నలకు చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల :

నేతన్నలకు చేతినిండా పని కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నేతన్న విగ్రహానికి జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తో కలసి పూలమాల సమర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాల్గొని చేనేత కార్మికులను, ఇటీవల 2 గంటల 30 నిమిషాలలో చీర నేసిన వెల్ది హరి ప్రసాద్ ను విప్ ఆది శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సిరిసిల్లలోని నేతన్నలు, కార్మికులు, ఆసాములు, యజమానులకు సంవత్సరంలో సుమారు 8 నెలల పాటు పని కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సంవత్సరం రూ. 6 కోట్ల 70 లక్షలకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంలు, ఇతర అవసరాలకు సంబంధించిన వస్త్రాల ఉత్పత్తి ద్వారా కూడా స్థానిక నేతన్నలకు పని కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 4 కోట్ల 50 లక్షల మీటర్ల చీరల తయారీకి అవకాశం కల్పించామని, త్వరలో మరో కోటి 50 లక్షలకు పైగా మీటర్లకు ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేతన్నల సంక్షేమం కోసం త్రిఫ్ట్ పథకం ద్వారా కార్మికుల పొదుపునకు ప్రభుత్వం సమానంగా చేయూతనిస్తోందన్నారు. నేతన్నల బీమా పథకం ద్వారా ఇప్పటివరకు సిరిసిల్లలో 129 మందికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించినట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులకు రూ.25 కోట్ల మేర రుణమాఫీ చేయడంతో పాటు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేసినట్టు వివరించారు. పవర్‌లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతన్నలు, నేతన్నలు సహా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలందరికీ రాష్ట్ర ప్రభుత్వం, తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన

మహిళనూ సామూహిక అత్యాచారం

ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు

దుండగులను అరెస్ట్ చేసిన

రిమాండ్‌కు తరలించిన పోలీసులు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసి బాధితురాలిని వీడియో తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఈనెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని రెండు పడకగదుల ఇళ్ల కాలనీలో తనకు తెలిసినవారి ఇంటికి వచ్చింది. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అనే యువకులు సదరు మహిళ ఉన్న ఇంట్లోకి ప్రవేశించి.. ఆమె తనకు సన్నిహితంగా వున్న ఓ వ్యక్తితో కలిసివున్న దృశ్యాలను తమ ఫోన్‌లో చిత్రీకరించారు. తర్వాత ఆమెపై వారిరువురు సామూహిక అత్యాచారానికి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించారు. అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తాము తీసిన వీడియోను పలువురికి పంపిస్తామని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడంతో గురువారం బాధితురాలు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులు వినియోగించిన ఇన్నోవా క్రిస్టా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1 నిందితుడు శివరాత్రి నరేశ్‌పై 13, ఏ-2 నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై 9 పాత కేసులతోపాటు రౌడీ షీట్లు ఉన్నట్లు వివరించారు. ఏ-3 నిందితుడు మారవేని మల్లేశ్‌పై 2, గుర్రం అంజయ్యపై ఒక కేసు గతంలో నమోదై ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘావేస్తామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సందీప్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రూ.5,400 వేల కోట్ల జరిమానా

మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్..

న్యూఢిల్లీ : సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.